

రీసర్వే పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద జిల్లాలో రీ సర్వే పనులను మరింత వేగవంతం చేసి, ఇప్పటికే పూర్తయిన గ్రామాల్లో వచ్చే ఆదివారం లోపు స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. గురువారం నాడు విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష భూ హక్కు పత్రాలు స్టోన్స్ గ్రౌండ్ టు థింక్ ప్రక్రియ తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర స్పెషల్ చీఫ్ కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో జిల్లాలో 26 గ్రామాలకు సంబంధించి 27,146 నెంబర్ రాళ్లు వచ్చాయన్నారు. ఇందులో ఇప్పటివరకు 22,714 రాళ్లను ఆయా పొలాల్లో నాటామన్నారు. మరో 4432 రాళ్లు నాటాల్సి ఉందన్నారు. వచ్చే ఆదివారం లోపు మిగతా రాళ్లను నాటే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. తీసుకుంటామని తెలిపారు.

విత్తన రిజిస్ట్రేషన్లు మొదలు

రైతు వాటా ముందుగా చెల్లించాల్సిందే..

ఇప్పటికీ ఖరారవని కంది విత్తన ధర



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు సంబంధించి వేరుశనగ సబ్సిడీ విత్తన పంపిణీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా గ్రామాల పరిధిలోనే రైతుభరోసా కేంద్రాల్లో విత్తనం అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే రైతులు తమ వాటా డబ్బులు ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో జమ చేయాల్సి ఉంటుంది. గతంలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుకాక ముందు విత్తన పంపిణీ సమయంలో రైతులు వారి వాటా డబ్బులు చెల్లించి విత్తనం తీసుకునే వారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విత్తన పంపిణీ ప్రక్రియ మొత్తాన్నీ మార్చివేసింది. రైతుభరోసా కేంద్రాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని తమ వాటా డబ్బులు ముందుగా చెల్లిస్తే గ్రామం పరిధిలోనే విత్తనాన్ని రైతులకు అందజేయడం జరుగుతోంది. ఇప్పుడు కూడా ఇదే పద్ధతిన పంపిణీ చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతుభరోసా కేంద్రాల వారీగా డిమాండ్‌ను అంచనా వేసి కేటాయింపులను అధికారులు పూర్తి చేశారు. కె-6 , కదిరి లేపాక్షి 1812 రకం రెండు రకాలు పంపిణీ చేపట్టనున్నారు. కె-6 సేకరణ ధర కిలో రూ.93 కాగా సబ్సిడీ 40 శాతం ప్రభుత్వమిస్తోంది. దీని ప్రకారం కిలోకు రైతు రూ.55.80 చొప్పున తన వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కదిరి, లేపాక్షి రకం సేకరణ ధర రూ.83 కాగా సబ్సిడీ 40 శాతం ప్రకారం రైతు తన వాటాగా కిలోకు రూ.49.80 చొప్పున ముందుగా రైతు భరోసా కేంద్రంలో చెల్లించాలి. 30 కిలోల బస్తా అర ఎకరంలోపు అయితే ఒకటి, అర ఎకరా నుంచి ఒక ఎకరా వరకు అయితే రెండు బస్తాలు, ఆపైన ఎంతున్నా మూడు బస్తాలు మాత్రమే గరిష్టంగా ఒక్కో రైతుకు ఇవ్వటం జరుగుతుంది. అనంతపురం జిల్లాకు సంబంధించి 78450 క్వింటాళ్ల విత్తనాన్ని కేటాయించారు. ఈ స్టాకును సేకరించే పనిని ఎపిసీడ్స్ చేపడుతోంది.

ఇప్పటి వరకు 300 క్వింటాళ్లు పొజిషన్


అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 300 క్వింటాళ్లు మాత్రమే పొజిషనింగ్ ఉంది. అది కూడా నాలుగు రైతు భరోసా కేంద్రాల పరిధిలోనే స్టాకుంది. బ్రహ్మసముద్రం, రాప్తాడు మండలాల పరిధిలోని నాలుగు రైతుభరోసా కేంద్రాల్లో ఈ స్టాకుంది. తక్కిన చోట ఇంకా స్టాకు రావాల్సి ఉంది. ప్రభుత్వం గత వారంలోనే విత్తన సేకరణ, సబ్సిడీ ధరలను నిర్ధారించింది. దీంతో సేకరణ ప్రక్రియ కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. గతంలో మన విత్తనం సొంత విత్తనం కూడా లేకపోవడంతో పూర్తిగా బయట నుంచి విత్తన సేకరణ చేపట్టాల్సింది. టెండర్లు కూడా ఖరారై ఉండటంతో ప్రయివేటు సంస్థల చేత మొత్తం విత్తన సేకరణ చేపట్టాల్సి ఉంది.

కంది, ఆముదం ఇంకా లేనట్టే

జిల్లాలో వేరుశనగతోపాటు అంతర పంటగానూ, పూర్తి పంటగానూ ఇటీవలి కాలంలో కంది, ఆముదం పంటల సాగు పెరిగింది. సాధారణంగా అయితే వేరుశనగతోపాటు ఈ విత్తనాలు పంపిణీ చేస్తే రైతుకు ప్రయోజనకరంగా ఉంటుంది. కంది ధరను ఇంత వరకు ప్రభుత్వం నిర్ణయించలేదు. దీంతో పంపిణీ జాప్యం జరిగే అవకాశముంది. కేటాయింపులు మాత్రం అనంతపురం జిల్లాకు 4300 క్వింటాళ్లు జరిపారు. ఆముదం పంటకు ప్రభుత్వం సబ్సిడీతో ఇవ్వదు. బహిరంగ మార్కెట్ ప్రకారమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ విత్తనాలతోపాటు పంపిణీ చేస్తే రైతులు ఒకేసారి కొనుగోలు చేసేందుకు వీలుంటుంది. రైతుల నుంచి డిమాండ్ వస్తే అప్పుడు ఆముదం విత్తనాన్ని తెప్పిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ తెలిపారు.

15 నుంచి విత్తన వేరుశెనగ రిజిస్ట్రేషన్ : జెడిఎ

సబ్సిడీ విత్తన వేరుశెనగ కోసం రైతులు ఈ నెల 15 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి(జెడిఎ) బి.చంద్రనాయక్ సూచించా రు. నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న సీడ్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి విత్తన మొలక శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన వేరుశెనగ నాణ్యతలో రాజీ పడకుండా సీడ్ ప్రాసెసింగ్ కేంద్రం అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలకు పేర్లు నమోదు చేసుకునేందుకు వెళ్లే రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డ్, మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలని సూచించారు. రైతుకు ఎన్ని బస్తాల వేరుశనగ కాయలు వస్తాయో వెబ్ ల్యాండ్ ఆధారంగా తెలుస్తుందన్నారు. అందుకు సంబంధించిన మొత్తంలో రైతు వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు.



పెన్నానది నుంచి ట్రాక్టర్ల తరలిపోతున్న

'పురం'లో

రెచ్చిపోతున్న ఇసుకమాఫియా..!

- పట్టపగలే యథేచ్ఛగా రవాణా
- మామూళ్లు పుచ్చుకుని సహకరిస్తున్న సెక్రటరీలు
- చోద్యం చూస్తున్న సెబ్, పోలీస్, రెవెన్యూ అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు

హిందూపురం ప్రాంతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. పట్టపగలే రెచ్చిపోయి పెన్నానదిలో ఇసుకను అక్రమంగా రవాణ చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన సెబ్, ఫోలీస్, రెవెన్యూ అధికారులు ఇసుక మాఫియా ఇచ్చే మామూళ్ల మత్తులో తులతూగుతున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే ఓ బండి ఇసుక దొరకని పరిస్థితి ఉంది. అయితే అధికార పార్టీ నేతలు మాత్రం వందలాది ట్రాక్టర్లను పెన్నానది నుంచి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల పరిధిలోని బీరేపల్లి పంచాయతీ సెక్రటరీ విజయ్ అనే వ్యక్తికి సంతకాలు చేసి మలుగూరు నుంచి పూలకుంటకు ఇసుక తరలింపునకు అనుమతులు ఇచ్చారు. ఈ లేఖను చూపి హిందూపురం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. అనుమతుల లేఖ పొందిన వ్యక్తి అధికార పార్టీ జెడ్పిటీసీ సోదరుని కుమారుడు, వైసిపి నాయకుడు కావడం గమనార్హం. బీరేపల్లి పంచాయతీ సెక్రటరీ సంతకంతో విజయ్ తీసుకున్న లేఖతో ఏకంగా పెన్ననదిలో ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి పట్టణంలోని హౌసింగ్ బోర్డు, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాలకు ఇసుకను సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసమే బేవినహళ్లి, సడ్లపల్లి ప్రాంతాల్లో పదుల సంఖ్యలో అక్రమ ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వీరందరూ పగలు అనుమతులు పేరుతో, రాత్రి అనుమతులు లేకుండానే 24 గంటలూ ఇసుకను పెన్నానది నుంచి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

వైసిపి అధికారంలో మరింత దోపిడీ

వైసిపి అధికారంలోకి వచ్చాక హిందూపురం నియోజకవర్గంలో ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోంది. ఇసుక మాఫియాను అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ విధానాన్ని తీసుకువచ్చింది. ఇసుక అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఇసుక బుక్ చేసుకుని, ప్రభుత్వం సూచించిన వాహనంలో తీసుకుపోవాల్సి ఉంది. దీంతో ప్రభుత్వనికి ఆదాయంతో పాటు అవసరం ఉన్నా వారికి ఇసుకను అందించడానికి అవకాశం ఉంది. హిందూపురం మండలంలో ఇసుక అక్రమార్జనే ధ్యేయంగా అలవాటు పడిన కొందరు రాత్రీపగలూ అన్న తేడా లేకుండా పెన్నానదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. పట్టణమే కాకుండా, పక్కన ఉన్న కర్నాటక రాష్ట్రనికి సైతం ఇసుకను తరలించి కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమార్కుల పరిస్థితి ఇలా ఉంటే సామాన్యులు మాత్రం ఇసుకదొరక్క నానావస్థలు పడుతున్నారు. ఇంటికోసం ఇసుకను తరలిస్తే సెబ్, ఫోలీస్ అధికారులు టక్కున దాడులు చేసి వారిపై జరిమానాలు విధిస్తున్నారు. అధికార పార్టీ నేతలు పట్టపగలే దర్జాగ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. అక్రమ ఇసుక రవాణా గురించి ఆయా ప్రాంత రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకుండా మరింత ఎక్కువ మాముళ్లు తీసుకుని వెళ్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

పడిపోతున్న భూగర్భ జలాలు

గతంలో ఇసుక వ్యాపారులు పెన్నానదిలో ఉన్న ఇసుకను పూర్తిగా కనమరుగు చేశారు. రెండు సంవత్సరాలుగ కురుస్తున్న వర్షాలతో పెన్నా ఏరు బాగా పారింది. దీంతో ఇసుక ఎక్కువగా చేరింది. దీంతో భూగర్భ జలాలు పెరిగి, రైతుల బోరు బావుల్లో నీళ్లు సంవృద్ధిగా చేరాయి. ఈ పరిస్థితి ఎక్కువ రోజులు ఉండకనే అక్రమ ఇసుక రవాణాతో మళ్లీ భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం నెలకొంది. బోరుబావి తవ్విస్తే నీరు పడడమే కష్టంగా ఉంది. హిందూపురం పరిసర ప్రాంతాల్లో దాదాపు 1200 అడుగులు బోరు వేసినా నీరు పడని పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పంటల సాగు కోసం రైతులు బోరుబావులు తవ్విస్తే అప్పులపాలు అవుతున్నారు. పెన్నానదిలో ఇసుకను అక్రమంగా తరలించడమే ఈ పరిస్థితికి కారణం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతుల ఇబ్బందులను గుర్తించి పెన్నా నదీ పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





బీరేపల్లి పంచాయితీ సెక్రటరీ పేరుతో ఇచ్చిన లేఖను చూపిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ (ఇన్‌సెట్‌లో లేఖ)

రెజ్లర్లపై లైంగిక వేధింపులు సిగ్గుచేటు

- బిజెపి ఎంపీని తక్షణం అరెస్టు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఒలంపిక్స్‌లో పతకాలు తీసుకొచ్చి దేశప్రతిష్టను ప్రపంచానికి చాటిన రెజ్లర్లపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడడం అత్యంత సిగ్గుమాలిన చర్యని, తక్షణం ఆయన్ను చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గణేష్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంతియాజ్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ మాట్లాడుతూ న్యాయం చేయాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లను బిజెపి పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. దేశానికి పేరుప్రతిష్టలు తీసుకొచ్చిన క్రీడాకారిణులు రెండు వారాలుగా న్యాయం కోసం తపిస్తున్నా మోడీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రధాని మోడీకి ఎన్నికల రాజకీయాలే ముఖ్యంగా భావించి, ఇతర సమస్యలను గాలికొదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని భేటీపడావ్, భేటిబచావో అనే నినాదం మాటలకే పరిమితం అయ్యిందని విషయం రెజ్లర్ల ఆందోళన చూస్తే అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ స్పందించి ఆరోపణలు ఎదర్కొంటున్న ఎంపీని పార్టీ, పార్లమెంట్ సభ్యత్వం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్.వెంకటేష్, బడా సుబ్బిరెడ్డి, ప్రవీణ్, పెద్దన్న, జంగాలపల్లి పెద్దన్న, జెడ్పీ.శ్రీనివాసులు, స్థానిక నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్ పాల్గొన్నారు.



గణేష్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

వైభవంగా లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణం, బ్రహ్మరథోత్సవం కార్యక్రమాలను గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. వెచ్చం అమర్‌నాథ్, వారి కుమారులు సుమన్, డాక్టర్ రత్నాకర్, డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు, ధర్మకర్త మండలి సభ్యు లు స్వామి వారి మడుగుతేరు, బ్రహ్మ రథోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయ ప్రధాన అర్చకులు రామకష్ణాచార్యులు అనేక పూజాధి కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని పురవీధుల గుండా ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో యాడికి నాగరాజు, ప్రగతి శ్రీనివాసులు, కన్నస్వామి, పురోహితులు, ధర్మకర్త మండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



లక్ష్మీ వెంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

22న కలెక్టరేట్ ముట్టడి

పెనుకొండ: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని మరువపల్లి, హను మపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా నాయకులు వెంకటరాముడు మాట్లాడు తూ ఉపాధి హామీ పథకం పరిరక్షణకై మే 22వ తేదీ కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చామని, అందులో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాడు-నేడు పనుల పరిశీలన

లేపాక్షి : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం ఎంపీడీఓ నరసింహనాయుడు పరిశీలించారు. కంచి సముద్రం పంచా యతీ పరిధిలోని మామడిమాకులపల్లి, బయన్నపల్లి పాఠశాలల తో పాటు లేపాక్షిలోని ఉర్దూ హైస్కూళ్లలో పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది సౌకర్యాలు మెరుగుపరచడం కోసం ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేస్తుందన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. ఎంఆర్‌సి కార్యాలయం వెళ్లి 'జగనన్న విద్యా కానుక' కిట్లను పరిశీలించి మండలంలోని ప్రతి విద్యార్థికి ఈ కిట్లు అందజేయాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ నాగరా జునాయక్, మండల ఇంజినీర్ హనుమేనాయక్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవం విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

గుడిబండ : ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. గుడిబండలోని టిడిపి సీనియర్ నేత న్యాయవాది శివకుమార్ ఇంటి ఆవరణలో గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ మడకశిర పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి టిడిపి ప్రజాప్రతినిధి, నాయకుడు, కార్యకర్త పసుపు రంగు చొక్కా ధరించి హాజరవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి టిడిపి మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ మద్దన కుంటప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్. మాజీ సర్పంచిలు, ఎంపిటిసిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలి

సబ్ కలెక్టర్, ఎమ్మెల్యేకు దళిత సంఘం వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం దళిత సంఘం ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు, ఎమ్మెల్యే శంకర నారాయణకు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించా రు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కె. కార్తీక్‌కు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర నారాయణకు దళిత సంఘాల నాయకులు పలు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అంబేద్కర్ భవనం, దళిత విద్యార్థుల ఉన్నత విద్యకు స్టడీ సర్కిల్ ఏర్పాటుకు భూమి కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.శివరామకష్ణ, ఏ.వెంకటేశులు, దండోరా రామాంజనేయులు, సూరి, రవికు మార్, సిఎం.సుధా కర్, కదిరిప్ప, టి.నరసింహులు, మల్లికార్జున, పోతులయ్య పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘం నాయకులు

ఎమ్మెల్యే తోపుదుర్తి ఆధ్వర్యంలో ఉచిత బోర్లు

కనగానపల్లిలో ప్రారంభించిన జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-కనగానపల్లి

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత నిధులతో రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా పేద రైతులకు ఉచిత బోర్ల పథకానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గురువారం మండల కేంద్రమైన కనగానపల్లిలో ఉచిత బోర్ల కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి(చందు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న రైతులకు ఉచితంగా బోర్లు వేయించి రైతులుగా మార్చిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జడ్పీటీసీ గౌని మారుతి ప్రసాద్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచిలు, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కనగానపల్లిలో ఉచిత బోర్లను ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

గ్రామాల్లో 'ఇదేంఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-రొద్దం

విధానసభ ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదురుచూస్తున్నారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా గురువారం క్లస్టర్-1 ఇన్‌ఛార్జి నాగేంద్ర ఆధ్వర్యంలో మండల పరిధిలోని సుబ్బరాయప్పగారి కొట్టాల, కనుమరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి వ్యత్యాసంపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వ దోపిడీ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. అలాగే టిడిపి ప్రవేశపెట్టిన 92612 92612 నంబర్‌కి మిస్డ్ కాల్ చేపిస్తూ ప్రజల అభిప్రాయలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, అంజినప్ప, సిద్ధప్ప, వైస్ సర్పంచి రామంజి, అంజి, వెంకటేష్, రాము, తురకలపట్నం రవి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇదేంఖర్మ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ఎఫ్‌ఎన్‌ఒల వేతనాలు విడుదల చేయాలి

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మున్సిపల్ కేంద్రంతో పాటు, జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎన్‌ఒలకు తక్షణమే వేతనాలు విడుదల చేయాలని టిడిపి శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కక్షపూరిత ధోరణిని అవలంభిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో వైఫల్యం చెందారన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ప్రవేశపెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యలు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

మైనార్టీలపై అక్రమ కేసులు బనాయించడం తగదు

ధర్మవరం టౌన్ : వైసీపీ చేపడుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించిన టీడీపీ మైనార్టీ నాయకునిపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని టీడీపీ మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగూరు ఉస్సేన్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మడకశిర పట్టణంలో బహిరంగవేలం ప్రక్రియలో మున్సిపల్ అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి భక్తర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారన్నారు. దీన్ని ఆసరగా తీసుకున్న అధికారపార్టీ నాయకులు భక్తర్‌పై అక్రమ కేసు నమోదు చేయించారన్నారు.



విరిగిన విద్యుత్‌స్తంభం



తెగిపడిన విద్యుత్‌తీగలు

ఈదురు గాలుల బీభత్సం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మండల పరిధిలోని ఆర్. యర్రగుంటపల్లి తండాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలులకు గ్రామంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు, రేకుల షెడ్లు నేలకొరిగాయి. ఏమి జరుగుతుందోనని తండా వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ స్తంభాలు ఇళ్లపై పడ్డాయి. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని తండా వాసులు తెలిపారు. ఈ విషయం తెలియగానే రెవిన్యూ సిబ్బంది గ్రామంలో పర్యటించి జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నారు. నష్టపోయిన తమను అధికారులు ఆదుకోవాలని తండా వాసులు రెవిన్యూ అధికారులను కోరారు

కొత్తచెరువు : గురువారం రాత్రి వడగళ్ల వాన, గాలి రావడంతో మండలంలో పలునష్టం జరిగింది. మండల కేంద్రంలో ని నాలుగురోడ కూడలిలో ఫ్లెక్సీలు విద్యుత్ మెయిన్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నాగులకనుం వద్ద మైలేపల్లి లో చెట్లు పడడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిఐ జయనాయక్, ఎస్ఐ లింగన్న రోడ్డుపై పడిన చెట్లను జెసిబి లతో సాయంతో తొలగించారు.

నేరాలు ఘోరాలు

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం

చిలమత్తూరు : మండలంలోని కొడికొండ గ్రామంలోని ఓ ఇంటిలో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటి లోని సామాగ్రి మొత్తం కాలి బూడిదైన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామంలోని జావిద్ అనే వ్యక్తికి చెందిన ఇంటి సామాగ్రి విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేరు. తమ బంధువుల వివాహానికి కుటుంబం మొత్తం వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంట్లో ఉన్న టివి, ఫ్రిడ్జి, బీరువా, కుట్టు మిషన్ తో పాటు మొత్తం కాలి బూడిద అయింది. ఇంటి చుట్టుపక్కల ఉన్న వారు గమనించి విద్యుత్ లైన్ ఆఫ్ చేయించి నీటితో ఆర్పి వేశారు. ఇళ్లు మొత్తం పొగచూరిపోయింది. దీంతో బాదితులు కన్నీరు మున్నీరయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

హిందూపురం : పట్టణంలో ఆహ్మద్ నగర్‌లో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పట్టణంలోని అహమ్మద్ నగర్ కు చెందిన ఫక్రుద్దీన్ అనే యువకుడు ఇదే ప్రాంతానికి చెందిన వివాహితతో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఫక్రుద్దీన్ మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా ఫకృద్దీన్‌కు, అతనితో సహజీవనం చేస్తున్న మహిళకు మధ్య మనస్పర్థలు వచ్చి ఘర్షణకు దిగారని, తమ కుమారుడిని ఆమె హత్య చేసిందని తమకు న్యాయం చేయాలని మృతుని బంధువులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఐ టీడీపీ కార్యకర్తపై దాడి

ధర్మవరం టౌన్ : ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్టులు పెడతావాలంటూ కొందరు వైసీపీ గుండాలు ఐటీడీపీ కార్యకర్తపై దాడికి పాల్పడ్డారు. పట్టపగలే కర్రలు, రాడ్లతో ఇంటిలోకి దూరి విక్షణా రహితంగా చితకబాదిన సంఘటన గురువారం జరిగింది. పట్టణంలో ఐటీడీపీ కార్యకర్త నరేష్‌ను 20 రోజుల క్రితం వైసీపీ గుండాలు దాడిచేసిన ఘటన మరువకనే గురువారం కూడా మరో ఐటీడీపీ కార్యకర్తపై వైసీపీ గుండాలు దాడిచేశారు. బాదితుడు వీరయ్య తెలిపిన వివరాలు... వీరయ్య 31వ వార్డు ఐటీడీపీ వార్డు అధ్యక్షుడుగా ఉన్నాడు. గురువారం సాయంత్రం వినయ్, రాజారెడ్డితో పాటు మరికొందరు మొదట ఇంటి వదకు వచ్చి పోలీసులు పిలుస్తున్నారు రావాలంటా అంటూ పిలిచారు. పోలీసులే వస్తారు కదా మీరెందుకు వచ్చారని వీరయ్య ప్రశ్నించాడు. దీంతో వారు ఒక్కసారిగా కర్రలు.. రాడ్లతో ఇంటిలోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. ఈసందర్భంగా వీరయ్య భార్య వెంకటలక్ష్మి కాళ్లవేళ్లా పడిన వారు కనికరించలేదు. చివరికి వీరయ్య వారి నుంచి తప్పించుకుని పారిపోయి ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. అక్కడ నుండే తనపై దాడి చేసిన విషయాన్ని పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులకు సమాచారం అందించారు. గతంలో యువగళం పాదయాత్రలో భాగంగా వారులో కరపత్రాలను పంపిణీ చేస్తున్నప్పుడు కూడా కరపత్రాలను పంపిణీచేయవద్దంటూ బెదిరించారని వీరయ్య తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పరిటాల శ్రీరామ్ టీడీపీనాయకులతో కలిసి చేరుకుని ఐటీడీపీ కార్యకర్తను పరామర్శించారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంలో ఇటీవల కాలంలో టీడీపీ కార్యకర్తలు, ఐటీడీపీ కార్యకర్తలపై వైసీపీ గుండాల దాడులు మితిమీరిపోయాయని అన్నారు. ఇంత జరుగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఏంచేస్తున్నారని,పోలీసులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. చాలా నెలల తరువాత ధర్మవరం సబ్ డివిజన్‌కు కొత్త డీఎస్పీ వచ్చారు. బాధ్యతలు చేపట్టిన రోజే ఇలా తమ కార్యకర్తలపై దాడి చేయడం దారుణమన్నారు. ప్రజలను భయపెట్టాలనే ఉద్దేశ్యంతోనే వైసీపీ నాయకులు ఈ దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

పవర్ లూమ్స్‌లో ప్యూర్ టూ ప్యూర్ నేస్తే సీజ్ చేస్తాం
ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఇకపై పవర్‌లూమ్స్‌లో ప్యూర్ టూ ప్యూర్ రకాలు నేస్తే తామే నేరుగా సీజ్ చేస్తామని నిబంధనలు అతిక్రమించినా వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పట్టణంలోని పవర్ లూమ్స్ యజమానులు, చేనేత కార్మికసంఘాలనాయకులతో ఎన్‌పోర్స్‌మెంట్ అధికారులు. ఆర్డీవో తిప్పేనాయక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్డీ రాజారావు మాట్లాడుతూ ధర్మవరంలో ఇటీవల కాలంలో పవర్ లూమ్స్, హ్యాండ్లూమ్ మధ్య సమస్య జరుగుతోందన్నారు. ఇదివరకే సమావేశాలు ఏర్పాటుచేసి పవర్‌లూమ్స్‌లో చేనేత 11రకాలు నేయరాదని చెప్పామని కొంత సమయం కూడా ఇచ్చామని, అయినా వారి తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుండి తాను రెండు నెలలైనా ఇక్కడే ఉండి ప్రతి రోజు పవర్‌లూమ్స్‌ను తనిఖీచేస్తానని. ఎవరైనా ప్యూర్ టూ ప్యూర్ నేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం చేనేత కార్మికులుకడుపు మండి రోడ్డుపైకి వచ్చారన్నారు.పట్టణంలో ఇప్పటికే జాబితాను సిద్ధం చేశామని, త్వరలో జీఎస్టీ వారిని పిలిపిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌కో అధికారులను పిలిచి పవర్‌లూమ్స్‌కు ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తామన్నారు. పవర్ లూమ్స్ దాడులకు వెళ్లితే తాళాలు వేసుకుని వెళ్తున్నారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు దృష్టికి కూడా తీసుకెళ్లానన్నారు. వీటిపై అప్‌డేట్ ఇవ్వాలని కలెక్టర్ వివరించారన్నారు. జిల్లాలో ఎవరైతే పవర్ లూమ్ చేనేత రకాలు నేస్తున్నారో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్యసాయి జిల్లాలో ఎక్కడా పవర్‌లూమ్స్ రిజిస్ట్రేషన్ చేయవద్దని, చేసినవాటిని కూడా రద్దు చేయాలని చేనేత జౌళిశాఖ జిల్లా ఏడీని ఎన్‌ఫోర్సమెంట్ ఆర్జేడీ ఆదేశించారు. అనంతరం చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ పవర్ లూమ్స్ నిబంధనల ప్రకారమే నడుపుకోవాలని, చేనేత రకాలను నేయరాదని అన్నారు. పవర్‌లూమ్స్‌కు ప్రభుత్వం రాయితీలు, రుణాలు కూడా ఇస్తుందన్నారు. అదేవిధంగా పవర్ లూమ్స్ యజమాని పోలావెంకటనారాయణ మాట్లాడుతూ ప్రతివారం యజమానులతో సమావేశమై ప్యూర్ టూ ప్యూర్ నేయరాదని చెప్పడం జరుగుతుం దన్నారు. ఎవరైతే ప్యూర్ టూ ప్యూర్ నేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు. అయితే వేరే ప్రాంతాల నుండి పవర్లూమ్స్ చీరలను వాహనాలలో తీసుకువచ్చి విక్రయిస్తున్నారని వాటిని అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అప్పాజీ, హ్యాండ్లూమ్ సత్యసాయిజిల్లా ఏడీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కపట్నం : ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి నిర్ణీత సమయంలో అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మండల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాడు నేడు పనులు, హౌసింగ్, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని, తమ శాఖల పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు సచివాలయ సిబ్బందితో సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఏఈ శశి కుమార్, ఏపీఎం నాగముని, ఏపీఎం రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

బుక్కపట్నం : సత్య సాయి జిల్లా కురబల ఆత్మీయ సమావేశం 13వ తేదీన జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో ఏర్పాటు చేస్తున్నామని జిల్లాలోని కురుబలు పాల్గొని జయప్రదం చేయాలని సత్య సాయి జిల్లా కురవ సంఘం నాయకుడు సామకోటి ఆదినారాయణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13వ తేదీన రాజకీయ పార్టీలకు అతీతంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, సురేంద్రబాబు, ఈశ్వరయ్య, రంగా, శ్రీరాములు, హరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గాండ్లపెంట : ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిపి జగన్మోహన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా అధికారులు సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రజలను కార్యాలయాల వద్ద చుట్టూ తిప్పుకోవద్దన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈసమావేశంలో ఎంపీడీవో డి అంజినప్ప, తహశీల్దార్ రవి,ఎంఇఒ కృష్ణానాయక్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, వైస్ ఎంపిపి గంగోజమ్మ భారతితో పాటు ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం డీఎస్పీగా శ్రీనివాసులు

ధర్మవరం టౌన్ : ధర్మవరం సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా టి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రమాకాంత్ బదిలీ కాగా ఆయన స్థానంలో అనంతపురం పీటీసీ నుంచి వచ్చిన టి.శ్రీనివాసులు ధర్మవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అదేవిధంగా ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎవరైన చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే అటువంటివారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన డీఎస్పీకి పలువురు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుని కుటుంబసభ్యులకు పరామర్శ

కదిరి అర్బన్ : నల్లచెరువు మండలం, మద్దిమడుగు గ్రామానికి చెందిన గోవిందరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కదిరి ఏరియా వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేసవిశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

గుడిబండ: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి అధికారి కరణం కమల నాబారావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిబిరం కరపత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేయడంతో పాటు, గ్రామ పరిధిలోని ప్రధాన స్థలాలు, పాఠశాలలు, కార్యాలయాల్లో గోడలకు అతికించామన్నారు. శిబిరంలో ప్రతిరోజూ విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, ఆటపాటలు నిర్వహిస్తామని తెలిపారు.



పదిఫలితాల్లో 'యశోద' విజయదుందుభి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పదవతరగతి ఫలితాల్లో పట్టణంలోని యశోద పాఠశాల విద్యార్థులు విజయదుందుబి మోగించినట్లు ఆపాఠశాల డైరెక్టర్ పృధ్వీరాజ్ తెలిపారు. పాఠశాలలో 156 మందికి గాను నలుగురు విద్యార్థులు 580పైన, 54 మంది 540 మార్కులకు పైగా మార్కులు సాధించారన్నారు. ఇందులో హన్సి 588, లలిత ప్రియ 586, శ్రీజ 584, లక్ష్మీప్రియ 580, వెన్నెల 579, మనురాజ్ 578, ఉష 577, భరద్వాజ్ 577, మాధవ్ సాయికిరణ్ 576, సాయి కౌసల్ 576 మార్కులు సాధించారన్నారు. వీరిని పాఠశాల డైరెక్టర్ తోపాటు ప్రిన్సిపల్ అనూష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రజలను అణచాలని చూస్తే తిరుగుబాటు తప్పదు: పరిటాల



బాధితుడిని పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రభుత్వ అధికారులను అడ్డంపెట్టుకుని అధికారంలో వున్నామన్న ధీమాతో పేద ప్రజలను అణచి వేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు. మండలంలోని పోట్లమర్రి గ్రామంలో వైసిపి నాయకులు హనుమంతురెడ్డి ఇంటికి రోడ్డు వేయాలని బలహీన వర్గాలకు చెందిన వ్యక్తికి చెందిన గుడిసెను పాక్షికంగా తొలగిచడంతో బాధితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ పోట్లమర్రి గ్రామానికి చేరుకుని బాధితుడితో మాట్లాడారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరాం మాట్లాడుతూ గతంలోనూ గుడిసెను కూల్చేందుకు ప్రయత్నించగా బాధితుడు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు చెప్పినా ఫలితం లేదన్నారు. కోర్టుకు వెళితే కేసు కట్టారన్నారు. అయినా మరోసారి దౌర్జన్యంగా గుడిసెను కూల్చి రోడ్డు వేయాలని ప్రయత్నించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉంది కాదా అనిపేదలను అణచివేయాలని చూస్తే వారిలో తిరుగుబాటు మొదలవుతుందన్నారు. అధికారులు కూడా పాలక వర్గ నాయకులకే మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. వైసిపి నాయకుల మాటలు విని ఎక్కడో గుజరాత్‌లో ఉండి ఉద్యోగాలు చేసుకుంటున్న వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే న్యాయం జరుగుతుందనే మాట పక్కనపెడితే తమకు అన్యాయం జరుగుతుందన భావన ప్రజల్లో వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడో జరిగే విషయాలు మాట్లాడే ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ధర్మవరానికి కూతవేటు దూరంలో వున్న పోట్లమర్రిలో జరుగుతున్న ఈ దౌర్జన్యం గురించి తెలియదా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులకు ఆయన వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే ప్రైవేటు కేసులు వేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. అంతకు ముందు బాధితుని స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి బండలు పాతించారు. అనంతరం బాధితులతో కలసి ధర్మవరం ఆర్డీవోను కలసి గ్రామంలో పరిస్థితిని వివరించారు. బాధితులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజవర్గం ఆర్‌టిఎస్ కోఆర్డినేటర్ బోయపాటి అప్పస్వామి నాయుడు, జగ్గు, మందల శ్రీనివాస్, రామాపురం కేశవ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 104 ఎన్ఎంయు నోడల్ అధికారి సెల్వమణికి 104 ఉద్యోగులు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, 104 ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని కోరారు. 104 ఉద్యోగులకు పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అందజేయాలని, బఫర్స్ ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, బదిలీల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలకు ఒకసారి ఉద్యోగులతో యాజమాన్య ప్రతినిధులు సమస్యలను చర్చించి పరిష్కరించాలని, ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించాలని కోరారు. ఈసందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు సింహ, ప్రవీణ్, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

వీధికుక్కలను నియంత్రించండి

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైందని వాటిపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం వలి కాలనీలో ఇర్ఫాన్ అనే 7 సంవత్సరాల బాలుడిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిందన్నారు. ఆ బాలుడు ప్రాణాపాయ స్థితిలో అనంతపురం సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణగా పట్టణంలో ఏ వీధిలో చూసిన కుక్కలు గుంపులు గుంపులుగా ఉంటున్నాయన్నారు. దీంతో స్థానికులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని అన్నారు. కుక్కలదాడిలో గాయపడిన బాలునికి మెరుగైన వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించి ఆ కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని జన సేన, బిజెపి నాయకులు మునిసిపల్ కమిషనర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ కుటాల,కాయల చలపతి, వానిల్లి అంజిబాబు, హరి బాబు, నందిశెట్టి బాబు, తలుపుల గంగాధర్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వేనెంబర్ 1777 లో జగనన్న లేఅవుట్‌ను స్థానిక డాక్టర్ పివి సిద్దారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇల్లు అన్న నినాదంతో అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను నిరంతరం అందజేస్తామని అన్నారు. అందులో భాగంగా కదిరి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్డీవో కార్యాలయంలో ఎదురుగా సర్వేనెంబర్ 1777 లో పేదవారికి ఇంటి పట్టాలను అందజేసేందుకు ఏర్పాటు చేస్తున్న జగనన్న లేఅవుట్‌ను అధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ఇది ఒక నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం చేపట్టిందని, అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా నష్టపోకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇంటి పట్టాలను అందజేయడంతో పాటు గృహ నిర్మాణం చేపట్టేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. మంచి లేఅవుట్‌లో లక్షలాది రూపాయల విలువచేసే స్థలాలను పేదలకు అందజేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇంకా ఎవరైన అర్హులుంటే ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు,వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో పురోగతి చూపించకపోతే చర్యలు

పుట్టపర్తి అర్బన్ : నాడు నేడు పనుల్లో పురోగతి చూపించాలని జాయింట్ కలెక్టర్ టి ఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పుట్టపర్తి కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మనబడి నాడు నేడు పనులపై జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మనబడి నాడు నేడు కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వారం రోజుల్లోపు పురోగతి చూపించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెనుకబడిన 10 మండలాల్లో పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని గుడిబండ, ముదిగుబ్బ, బత్తలపల్లి, రామగిరి, అగళి, గోరంట్ల, రొళ్ల, ఎన్ పి కుంట, నల్లమాడ, గాండ్లపెంట తదితర మండలంలో నాడు నేడు పనులు పురోగతి తక్కువగా ఉందని వెంటనే వేగంగా పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పనుల్లో ఎలాంటి పురోగతి చూపించని ప్రధానోపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేయాలన్నారు. అంతేకాకుండా ఇరిగేషన్ అధికారులకు, గుడిబండ ఇరిగేషన్ ఎఇకి షోకజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు రాకపోతే పనుల్లో పురోగతి లేకపోతే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాడు నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు త్వరగతిన చేపట్టేలా చూడాలని అధికారులను జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ మీనాక్షి, ప్లానింగ్ ఆఫీసర్ మదన్, ఆయా మండలాల ఎంఇఒలు గోపాల్, శ్రీధర్, సుధాకర్ నాయుడు, వేమనారాయణ, గోపాల్ నాయక్, చాముండేశ్వరి, కృష్ణ నాయక్, గోపీ, ఎపిఎంలు, ఫీల్డ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: మండల పరిధిలోని ఐటిఐ కళాశాల, ప్రయివేట్ ఐటిఐ కళాశాలల్లో ప్రవేశానికి నేటి నుంచి జూన్ 6వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అజమతుల్లా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు నంబర్‌కు 82971 70834 ఫోన్ చేయవచ్చు అన్నారు.

వైఎస్‌ఆర్ బీమా సాయం అందజేత

సోమందేపల్లి : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన నాగరాజు(43)కు గురువారం సర్పంచి గిరిజమ్మ నాగరాజురావు, పంచాయతీ కార్యదర్శి నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ. 10 వేలను భార్య నాగమణికి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అమర్నాథ్, లోకేష్, సజ్జప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.